వేగానికి కళ్లెమేది..?

- పాతనగరం వీధి రోడ్లపై దూసుకుపోతున్న వాహనాలు
- ప్రమాదాల బారిన ప్రజలు
- కానరాని స్పీడ్ బ్రేకర్లు
- ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి



29వ వార్డు దిబ్బలపాలెంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన వీధి రోడ్డు



కంచరవీధి యాసిన్ బాబా దర్గా వద్ద కానరాని స్పీడ్ బ్రేకర్లు

దాబాగార్డెన్స్: పాత నగరంలోని వీధి రోడ్లపైకి రావాలంటేనే జనం భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు అతివేగంతో దూసుకొస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడతున్నారు. జనావాసాలు ఉండే రోడ్లలోనూ వాహన చోదకులు వాహనాలు అతివేగంతో నడుపుతుండడంటంతో నివాసులు హడలిపోతున్నారు. వాహనాల వేగ నియంత్రణకు కళ్లెం వేసేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఈ ప్రాంతాల్లో వేగ నిరోధకాలు అవసరం

జీవీఎంసీ 38వ వార్డు ఫిషింగ్ హార్బర్ రోడ్డు కంచర వీధి, యాసిన్‌బాబా దర్గా, అల్లిపురం, 29వ వార్డు మహారాణిపేట, దిబ్బలపాలెం, ఘోషాస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో కుర్రాళ్లు వాహనాలను అతి వేగంతో నడుపుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో ఇష్టానుసారంగా డ్రైవ్ చేస్తున్నారు. దీంతో పిల్లలు, మహిళలు రోడ్ల మీదకు రావాలంటే జంకుతున్నారు. అతివేగం కారణంగా వాహనం నడిపేవారితోపాటు స్థానికులు కూడా గాయాలపాలవుతున్నారు. మద్యం తాగిన మైకంలో కొందరు.. పలువురు యువకులు వాహనాలను ఇష్టానుసారం నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. చెంగల్రావుపేటలో మసీదు, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, రామాలయం, కంచరవీధిలో ఎంబర్‌మన్నార్ గుడి, కనకమహాలక్ష్మి ఆలయం, ఘోషాస్పత్రి ఉండగా.. జగదాంబ జంక్షన్‌కు కూత వేటు దూరంలో 29వ వార్డు దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, దాబాగార్డెన్స్ పలు ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లే భక్తులతో నిత్యం ఈ కూడళ్లు రద్దీగా ఉంటాయి. మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలతో వీరు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



29వ వార్డు దిబ్బలపాలెంలో ద్విచక్ర వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా పిల్లలు, మహిళలు తిరుగుతుంటారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో కుర్రకారు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. ప్రశ్నిస్తే తగాదాలకు దిగుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– వద్రి వరలక్ష్మి, దిబ్బలపాలెం

అతివేగానికి అడ్డుకట్ట వేయాలి



38వ వార్డు యాసీన్ బాబా దర్గా పరిసర ప్రాంతాల ప్రజల తరఫున ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఎన్నో సార్లు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించ లేదు. వీధుల్లో రెచ్చిపోతున్న యువత బైక్ రైడింగ్‌కు స్పీడ్ బ్రేకర్ల ద్వారా అడ్డుకట్ట వేయాలి.

– డాక్టర్ రియాజ్ అహ్మద్, కంచర వీధి

బయటకు రావాలంటే భయం



మా ప్రాంతం మీదుగా పాఠశాల, చర్చ్, అంబికా బాగ్ రామాలయానికి అధిక సంఖ్యలో జనం వెళ్తుంటారు. యువత ఈ మార్గాల్లో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నా. దీంతో బయటకు రావాలంటేనే భయంగా ఉంటోంది. మా ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– సిహెచ్.రాజేశ్వరి, దిబ్బలపాలెం

పలుమార్లు విన్నవించాం



స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో జరుగుతున్న అనర్థాలను అధికారులకు పలుమార్లు విన్నవించాం. వేగ నిరోధకాలు లేనందు వల్ల యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. అతివేగంపై పోలీసులు దృష్టి సారించాలి.

– నాగమణి, మహారాణిపేట

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



రోడ్డు దాటే సమయంలో ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియడం లేదు. వేగంగా వచ్చి స్థానికులను ఢీకొంటున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వేగాన్ని నిరోధించే అవకాశముంటుంది.

– గర్రెడ్డి రమాదేవి, రామాలయం వీధి

క్లుప్తంగా

నాలుగో రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ లక్ష్మీ పూజలు సోమవారానికి నాలుగో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాద సుస్వరాల మధ్య అమ్మవారి పూజలు ప్రారంభించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపిన భక్తుల పేరిట పూజలు చేసి, కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ

మహారాణిపేట: హెపటైటిస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినం సందర్భంగా కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెపటైటిస్ బీ స్క్రీనింగ్, టీకాల కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ తదితరులు ప్రారంభించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్, డాక్టర్ వంశీ యాదవ్, డాక్టర్ ఎస్.శ్రీదేవి పాల్గొని, హెపటైటిస్‌పై అవగాహన కల్పించి టీకాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

'సినారె' రచనలు సందేశాత్మకం



సినారె సాహిత్య సమాలోచన సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని విశాఖ పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ లైబ్రరీలో సినారె సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి రచించిన చారిత్రక గేయ కథా కావ్యం కర్పూర వసంత రాయలులోని కథన శిల్పాన్ని శైలీ సౌకుమార్యాన్ని దేశం కోసం వ్యక్తులు త్యాగం చేయాల్సిన అవసరాన్ని సందేశాత్మకంగా వ్యక్తం చేశారని వివరించారు. కొండవీటి కుమారగిరి రెడ్డి కాలంనాటి చారిత్రక గాథను రస రమ్యంగా అక్షరీకరించారన్నారు. రాంభట్ల నృసింహ శర్మ సి.నా.రె. గీతాలు ఆలపించి, వాటి సౌందర్యాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శేఖర మంత్రి ప్రభాకర్, డాక్టర్ కె.ఎస్.ఎన్.మూర్తి, శివాజీ, రాధారాణి, నిర్మల, ఉప్పల అప్పలరాజు ప్రసంగించారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం

సీతంపేట: దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి హెచ్చరించారు. దళితుల హక్కుల సాధన కోసం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇపుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదని చెప్పారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కని, దానిని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు వివిధ రూపాల్లో పోరాడుతామని తెలిపారు.

నాట్యకళను ప్రోత్సహించాలి



నాట్యగురువులను సత్కరిస్తున్న రాజశేఖర్, మహ్మద్ షకీల్ తదితరులు

దాబాగార్డెన్స్: నాట్యకళను ప్రోత్సహించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కోరారు. మిరాకిల్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ నేతృత్వంలో దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'సకల కళా ఉత్సవం' పేరిట సోమవారం నిర్వహించిన నృత్యపోటీల్లో ఆయన మాట్లాడారు. భారతీయ సంప్రదాయంలో భాగమైన శాస్త్రీయ నాట్య కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ చేపడుతున్న కళాత్మక కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా నాట్య కళల వైభవానికి కృషి చేస్తున్న నాట్య గురువులను రాజశేఖర్ సత్కరించారు. వివిధ అంశాలపై నిర్వహించిన నృత్య పోటీల్లో విజేతలకు ఎస్.జ్యోతి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణిపేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని, వివరాలకు 96761 70026, 798957 2891 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏవీఎన్ జగ్గారావుకు నివాళి



జగ్గారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సింహాద్రినాయుడు

అల్లిపురం: నిరంతర ప్రజా సేవకుడు ఏవీఎన్ జగ్గారావు అని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అన్నారు. కళాశాల పూర్వ వైస్ చైర్మన్ ఏవీఎన్ జగ్గారావు 35వ వర్ధంతి సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని, జగ్గారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు పుష్కరకాలం పాటు వైస్ చైర్మన్‌గా సేవలందించి, విశ్వవ్యాప్తంగా ఏవీఎన్ కళాశాల గుర్తింపు పొందడంలో జగ్గారావు కీలకపాత్ర పోషించారన్నారు. విశాఖ పోర్టు అభివృద్ధిలో, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యునిగా వివిధ వాణిజ్య సంస్థలు నిలదొక్కుకొనేందుకు చేసిన కృషి విశాఖ ప్రజలు ఎన్నటికీ మరచిపోరన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా యూనివర్సిటీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, గ్రంథాలయ విభాగాధి పతి స్వరాజ్యలక్ష్మి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, అధ్యాపకులు ఇందిర, అప్పారావు, గాంధీ, సురేష్‌బాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

థైక్వాండోలో విశాఖ క్రీడాకారుల సత్తా

- 12 బంగారు, 8 రజత పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం



థైక్వాండో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విశాఖ క్రీడాకారులు

మురళీనగర్: థైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. యలమంచిలిలో అనకాపల్లి యూత్ థైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా స్థాయిలో 5వ సబ్ జూనియర్ థైక్వాండో చాంపియన్‌షిప్–2025 నిర్వహించారు. 108 మంది థైక్వాండో క్రీడాకారులు పోటీపడ్డారు. విశాఖ నుంచి మురళీనగర్, నౌసేనా భాగ్, కోస్ట్ గార్డ్ బ్రాంచిల నుంచి 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మురళీనగర్ నుంచి 20 మంది పాల్గొనగా.. వీరిలో 11 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు. మొత్తంగా 20 పతకాలు సాధించారు. వీటిలో 12 బంగారు, 8 రజతం, ఒక కాంస్య పతకం ఉన్నాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విశాఖ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. వీటితోపాటు కొరిగి విభాగంలో ఒక కాంస్యం, వ్యక్తిగత ప్యూమ్సేలో బంగారు పతకం సాధించారు. కోస్ట్‌గార్డ్ బ్రాంచి నుంచి 12 మంది, మురళీనగర్ నుంచి నలుగురు, నౌసేనాబాగ్ బ్రాంచి నుంచి నలుగురు పతకాలు సాధించినట్లు మురళీనగర్ కోచ్ మిధిలేష్ పల్లం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను పలువురు అభినందించారు.

మహిళా వాకర్స్ సేవలు ప్రశంసనీయం



సురేఖ పట్నాయక్‌కు విద్యా సామగ్రిని అందిస్తున్న ప్రభావతి, మహిళా వాకర్స్

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అన్నారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో సోమవారం వాకర్స్ క్లబ్‌లో గిరిజన ప్రాంత పాఠశాలల విద్యార్థులకు అధ్యయన సామగ్రి వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు, మహిళా చైతన్య కార్యక్రమాల నిర్వహణ ద్వారా క్లబ్ సభ్యులు గుర్తింపు పొందారన్నారు. అనంతరం మాడుగుల మండలంలోని కొత్తపాలెం తదితర గిరిజన ప్రాంత పాఠశాలల పేద విద్యార్థులకు అందజేయాలని నోట్ పుస్తకాలు, స్టేషనరీ, ఇతర సామగ్రిని ట్రైబల్ సొసైటీ వ్యవస్థాపకురాలు యు.సురేఖ పట్నాయక్‌కు ప్రభావతి, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్‌ల చేతుల మీదుగా అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, రీజినల్ కౌన్సిలర్–5 ఉప్పలపాటి శుభ, ఎలెక్ట్ గవర్నర్ మహేష్ మహిళా వాకర్స్ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, కార్యదర్శి పి.కమల, ఎడిటర్ డి.శిరీష, బోర్డ్ డైరెక్టర్ ఎ.రాధ, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సిహెచ్.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాష్ పాల్గొన్నారు.

300వ రోజుకు పోర్టు ఆస్పత్రి పరిరక్షణ దీక్షలు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను ఆపాలని కైలాసపురం పోర్టు ఆస్పత్రి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 300వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మానవ హారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ ఈ పోరాటం వల్ల గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ రాలేదని, ఆస్పత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అనర్థమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. దీక్షకు బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.ప్రకాష్, డాక్‌యార్డ్ యూనియన్ నాయకుడు గణేష్ సంఘీభావం తెలిపారు.

అర్ధరాత్రి వేళ.. సీపీ ఆకస్మిక తనిఖీలు

- బయటపడిన పోలీస్ స్టేషన్ల లోపాలు

తాటిచెట్లపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన అర్ధరాత్రి తనిఖీల్లో పలు పోలీస్ స్టేషన్లలోని లోపాలు బయటపడ్డాయి. వివరాలిలా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫోర్త్ టౌన్ పీఎస్‌లో విధులు నిర్వర్తించాల్సిన సెంట్రీ నిద్రపోవడాన్ని గుర్తించారు. ద్వారకా స్టేషన్ నిబంధనలకు విరుద్ధంగా తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. వెంటనే సిబ్బందికి మోమోలివ్వాలని సంబంధిత ఏసీపీలకు కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

10 కేజీల గంజాయి స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఒక వ్యక్తిని టూ టౌన్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 కేజీల గంజా యి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపి న వివరాలిలా.. చావులమదుం దరి హరిత లాడ్జిలో ఎస్ఐ సునీల్, కానిస్టేబుళ్లు గోవింద రావు, అజీజ్ సహకారంతో సోమ వారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోదా జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీగోదా దేవి అమ్మవారి జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. హోమం, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని వివిధ పూలమాలలో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు పలువురు కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

బాలోత్సవం పోటీలకు ఆహ్వానం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లు ప్రతి పాఠశాలలకు అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6లోపు ఏయే అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా బాలోత్సవం కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి శేషగిరిరావు, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ప్రతినిధులు రమాప్రభ, సతీష్, కళాశాల అధ్యాపకురాలు నాగమణి, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు ఎస్సీ అప్పారావు, కె.నర్సింగరావు, శంకర్రావు, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు తిప్పలు



ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌ను శుభ్రపరుస్తున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: చాలీచాలని అన్నం, కూరతో సరిపెట్టుకోమని నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ చెబుతున్నారని హాస్టల్లో ఉంటున్న ఓ విద్యార్థిని తండ్రి వాపోయారు. పిల్లల బాగోగులు చూసే వార్డెన్ విద్యార్థినులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పిల్లలకు మూడు పూటలా సరిగ్గా తిండి పెట్టడం లేదని, ఏమైనా అడిగితే ప్రభుత్వం మీకు కేవలం రూ.50 మాత్రమే ఇస్తోందని, తన సొంత డబ్బులు పెట్టుకోలేం కదా.. అని అంటున్నారని 'సాక్షి' వద్ద వాపోయాడు. విద్యార్థినులతోనే మంచినీటి ట్యాంకులు క్లీన్ చేయించడం, హాస్టల్ ప్రాంగణం తుడిపించడం వంటివి చేయిస్తున్నారని తెలిపాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఇక్కడి నుంచి గెంటి వేస్తానని వార్డెన్ బెదిరిస్తున్నారని అన్నాడు. హాస్టల్ శుభ్రంగా లేని కారణంగా దోమల బెడదతో పలువు రు విద్యార్థినులు జ్వరాలతో ఇంటికి వెళ్లిపోయారని చెప్పాడు.

బాగానే చూసుకుంటున్నాం

హాస్టల్‌లో విద్యార్థినులను బాగానే చూసుకుంటున్నాం. వారిచేత పనులు చేయించడం లేదు. ఇటీవలే కొంత మంది కార్మికులను పనిలో పెట్టుకున్నాం. భోజనం బాగానే పెడుతున్నాం. సందేహముంటే హాస్టల్‌కు వచ్చి చూసుకోండి.

– అన్నపూర్ణ, వార్డెన్, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్

క్యాబినెట్‌లో జర్నలిస్టుల సమస్యలపై సానుకూల నిర్ణయం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

మహారాణిపేట: ఆగస్టు 6న జరగనున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో జర్నలిస్టులకు మేలు కలిగే నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చినట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో మంత్రికి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇల్లు లేదా ఇంటి స్థలం, అక్రిడేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చే ప్రక్రియపై క్యాబినెట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నట్టు శ్రీనుబాబు చెప్పా రు. ఇప్పటికే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల పింఛన్లపై పదేపదే ప్రస్తావిస్తూ వస్తున్నారని చెప్పారని మంత్రి వివరించినట్టు పి.నారాయణ తెలిపారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.శివ ప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ సంయుక్త కార్యదర్శులు నాగేశ్వరరావు, నగేష్ జర్నలిస్టుల కోసం మీడియా కమిషన్, ప్రమాద బీమా పథకం, ఎటాక్స్ కమిటీలు, ఓల్డేజ్ హోం వంటివి ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

గోపాలపట్నం: దేశ ప్రజలతో పాటు శాస్త్రవేత్తలకు ఆదర్శప్రాయుడు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ కొనియాడారు. ఎన్ఎస్‌టీఎల్‌లో భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన కలాం విగ్రహానికి అబ్రహం వర్గీస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్‌కు కలాంకు అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.